
సాక్షి
సూర్యాపేట
బుధవారం ၊ 8 ၊ ఫిబ్రవరి ၊ 2023



విద్యుత్ వెలుగుల్లో పెద్దగట్టు ఆలయ పరిసరాలు

వైభవంగా లింగన్న కల్యాణం

- చంద్రపట్నం వేసి వివాహమహోత్సవం నిర్వహించిన పూజారులు
- భారీగా తరలివచ్చిన భక్తులు



దురాజ్‌పల్లిలోని పెద్దగట్టు శ్రీలింగమంతుల స్వామి ఆలయంలో చంద్రపట్నం వేస్తున్న మెంతబోయిన, మున్న, బైకాన్ వంశస్తులు

సూర్యాపేట, చివ్వెంల : దురాజ్‌పల్లి శ్రీ లింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతరకు మంగళవారం భక్తులు పోటెత్తారు. ఉదయం కాస్త తక్కువగా వచ్చినా మధ్యాహ్నానికి ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. జాతరలో మూడో రోజు కార్యక్రమంలో భాగంగా చంద్రపట్నం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవులు తమ సంప్రదాయ ప్రకారం గుడి ప్రాంగణంలో శ్రీ లింగమంతుల స్వామి, మాణిక్యమ్మల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణ తంతును చూస్తూ యాదవ కుటుంబాలు, భక్తులు ఓ లింగా.. ఓ లింగా నామస్మరణ చేశారు. మంత్రి జగదీశ్‌రెడ్డి కుటుంబ సమేతంగా పూజల్లో పాల్గొన్నారు.

చంద్రపట్నం ప్రత్యేకత ఇదీ..

మంగళవారం ఉదయం హక్కుదారులైన మున్న, మెంతబోయిన వంశీయులు బైకానుల వారితో చంద్రపట్నం వేయించి లింగమంతులు, మాణిక్యమ్మల కల్యాణం జరిపించారు. కల్యాణానికి అవసరమైన పట్టు వస్త్రాలు, పెళ్లి సామగ్రి మెంతబోయిన వారు తీసుకొచ్చారు. ముందుగా మండపంలో బైకాన్లు వాయిద్యాలు వాయిస్తూ కథలు చెపుతూ చంద్రపట్నం వేసే ప్రాంతాన్ని శుభ్రపరిచారు. ఆ ప్రాంతంలో దీర్ఘచతురాస్రకారంలో చందనం చల్లారు. దీనిపై పసుపు, కుంకుమ, తెల్లపిండి, పచ్చపిండి అద్ది 16 అడుగుల చంద్రపట్నం వేశారు. బైకానుల వాయిద్యాల నడుమ దేవరపెట్టెను తీసుకువచ్చి చంద్రపట్నంపై ఉంచారు. పట్నంపై రెండు పోలు ముంతలు పెట్టి చుట్టూ దారం చుట్టారు. వాటి ముందు రెండు మట్టి పాత్రలను ఉంచి నువ్వుల నూనె పోసి జ్యోతులను వెలిగించారు. తర్వాత సంప్రదాయం ప్రకారం యాదవ కులస్తుల పుట్టుక, చరిత్ర, లింగమంతులు, మాణిక్యమ్మల చరిత్రను కథల రూపంలో చెప్పారు. మాణిక్యమ్మ తరఫున మున్న వంశస్తులు, లింగమంతుల తరఫున మెంతబోయిన వంశస్తులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. బైకానులు పురోహితులుగా ఉండి చంద్రపట్నంపై ఉంచిన దేవరపెట్టెలోని లింగమంతుల స్వామి, మాణిక్యమ్మల విగ్రహ మూర్తులకు కల్యాణం జరిపించారు.

న్యూస్‌రీల్

పనుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు



సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్

కోదాడ: పనుల నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ మోహన్‌రావు హెచ్చరించారు. మంగళవారం కోదాడ ఆర్డీఓ కార్యాలయంలో వివిధ మండలాల తహసీల్దార్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ ఫైల్స్ పెండింగ్‌లో ఉండకుండా ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని క్లియర్ చేయాలన్నారు. రెవెన్యూ శాఖలో కూడా పెండింగ్ పనులు సత్వరమే పూర్తి చేయాలన్నారు. డబుల్ బెడ్ రూం పనులు కూడా పూర్తిచేయాలన్నారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే సమీక్షా సమావేశాలకు అధికారులు తగిన సమాచారంతో హాజరుకావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కోదాడ ఆర్డీఓ కిశోర్‌కుమార్, వివిధ మండలాల తహసీల్దార్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా చేపట్టాలి



వినతిపత్రం ఇస్తున్న టీపీయూఎస్ నేతలు

సూర్యాపేటటౌన్ : జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల కౌన్సిలింగ్‌ను పారదర్శకతతో చేపట్టాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్వతం సంధ్యారాణి, యామా రమేషు అన్నారు. మంగళవారం కలెక్టర్ వెంకట్రావుకు టీపీయూఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల కౌన్సిలింగ్ 2023నకు సంబంధించిన సీనియారిటీ జాబితాల్లో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా, ఏ ఒక్క ఉపాధ్యాయుడికి అన్యాయం జరగకుండా పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బైరు తిరుమలేష్, బట్టిపల్లి సాయికుమార్, శ్రీనివాసరావు, రేపాల రజని, కోట శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహాస్వామి నిత్యకల్యాణాన్ని మంగళవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ,ప్రత్యేకార్చనలు చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. నూతన పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహించారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం , మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేదమంత్రోచ్ఛరణలతో కల్యాణతంతు ముగించారు. శ్రీ ఆంజనేయ స్వామికి నాగవల్లి దళాలతో ప్రత్యేకార్చనలు చేశారు. కార్యక్రమంలో విజయ్ కుమార్ ,నవీన్, లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు ,లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

‘తలసరి’ మెరుగు!

- ప్రైవేట్ పాఠశాలల్లో సూర్యాపేట జిల్లా 13వ స్థానం
- గృహ విద్యుత్ కనెక్షన్లు 64 శాతం
- వంద శాతం కోవిడ్ టీకా
- 10లక్షల జనాభాలో లక్ష మంది రైతులు

సోషియో ఎకనామిక్ ఔట్‌లుక్-2023లో వెల్లడి



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: సూర్యాపేట జిల్లాలో తలసరి ఆదాయం పెరిగింది. 2019-20 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 2020-21లో పెరుగుదల నమోదైంది. ప్రస్తుత ధరల ప్రకారం జిల్లాలో తలసరి ఆదాయం రూ.1,73,186 నుంచి రూ.1,75,606కు పెరిగింది. నల్లగొండ జిల్లాలో రూ.1,97,896 నుంచి రూ.2,04,847కు పెరిగింది. గణాంక శాఖ సోమవారం వెల్లడించిన సోషియో ఎకనామిక్ ఔట్‌లుక్ -2023లో ఈ అంశాలను వివరించింది. గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులను యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో మిగతా జిల్లాలతో పోల్చితే మొదటి స్థానంలో మహబూబ్‌నగర్ ఉండగా.. సూర్యాపేట 25వ స్థానంలో, నల్లగొండ 28వ స్థానంలో ఉంది.



- 15 నుంచి 18 ఏళ్లలోపు వయస్సు వారికి 100 శాతం కోవిడ్ రెండో డోస్ వ్యాక్సిన్ పూర్తి చేసిన జిల్లాల్లో నల్లగొండ, సూర్యాపేట ఉన్నాయి.

నివేదికలోని మరికొన్ని ప్రధాన అంశాలు..

- ప్రైవేటు పాఠశాలలు అత్యధికంగా ఉన్న జిల్లాల్లో హైదరాబాద్ మొదటి స్థానంలో ఉంది. రెండో స్థానంలో మేడ్చల్ మల్కాజిగిరి ఉండగా, మూడో స్థానంలో రంగారెడ్డి, నాలుగో స్థానంలో నిజామాబాద్ నిలిచింది. సూర్యాపేట జిల్లా 263 స్కూళ్లతో 13వ స్థానంలో ఉంది.
- రేషన్ దుకాణాల్లో నల్లగొండ జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. మిగతా జిల్లాలతో పోల్చితే మన జిల్లాలోనే అత్యధికంగా 991 రేషన్ దుకాణాలు ఉన్నాయి. అన్న పూర్ణ, అంత్యోదయ, ఆహార భద్రత కార్డులు కలిపి మొత్తంగా జిల్లాలో 4,67,775 కార్డుదారులు ఉన్నారు. సూర్యాపేట జిల్లాలో 610 రేషన్ షాపులు ఉండగా, 3,25,782 మంది కార్డుదారులు ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.
- సూర్యాపేట జిల్లాలో 64.34 శాతం గృహ విద్యుత్ కనెక్షన్లు, 13.05 శాతం వ్యవసాయ, 10.82 శాతం పారిశ్రామిక విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.
- క్రాప్ డైవర్సిఫికేషన్‌లో సూర్యాపేట జిల్లా చివరి స్థానంలో ఉంది.
- 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పోల్చితే ఖమ్మం జిల్లాలో వ్యవసాయ కూలీలు అత్యధికంగా 4,14,250 మంది ఉండగా, నల్లగొండ జిల్లాలో 3,89,621 మంది ఉన్నట్లు సర్వే తెలిపింది. సూర్యాపేట జిల్లాలో 10,99,560 జనాభా ఉండగా, అందులో రైతులు 98,773 మంది, వ్యవసాయ కూలీలు 3,15,838 మంది ఉన్నారు.

- అంగన్‌వాడీ కేంద్రాలు అత్యధికంగా ఉన్న జిల్లాల్లో నల్లగొండ మొదటి స్థానంలో ఉంది. జిల్లాలోని 2,093 అంగన్‌వాడీ కేంద్రాల్లో 2012 మంది అంగన్‌వాడీ టీచర్లు ఉండగా, 1709 మంది ఆయాలు ఉన్నారు. 104580 మంది విద్యార్థులు ఉన్నట్లు సర్వే వెల్లడించింది. సూర్యాపేట జిల్లాలోని 1,209 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1155 మంది అంగన్‌వాడీ టీచర్లు, 1018 మంది ఆయాలు, 68,728 మంది విద్యార్థులు ఉన్నారు.



100 పడకలకు తుంగతుర్తి సీహెచ్‌సీ

30 పడకల నుంచి ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్

- భవన నిర్మాణం, ఫర్నిచర్‌కు రూ.44.95 కోట్లు మంజూరు
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ
- ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ కృషితో అందనున్న మెరుగైన వైద్య సేవలు



తుంగతుర్తి, సూర్యాపేట: తుంగతుర్తి నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక నెరవేరింది. ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ కృషితో నియోజకవర్గ కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) స్థాయిని రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. 30 పడకలనుంచి 100 పడకల ఏరియా ఆస్పత్రిగా మారుస్తూ మంగళవారం కుటుంబ ఆరోగ్య శాఖ కార్యదర్శి ఎస్ఎం రిజ్వీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పరిపాలన అనుమతులు ఇచ్చింది. భవన నిర్మాణంతో పాటు ఫర్నిచర్ కోసం రూ.44.95 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఆ శాఖ పేర్కొంది. దీంతో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి.

మొదట వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో..

గతంలో వైద్యారోగ్యశాఖ పరిధిలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి 2022 ఏప్రిల్1 నుంచి వైద్యవిధాన పరిషత్‌లో విలీనమైంది. వైద్య విధాన పరిషత్ విభాగంలోకి రావడంతో స్పెషలిస్టు డాక్టర్లతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందున్నాయి. ప్రస్తుతం 30 పడకల సామర్థ్యంతో ఉండగా.. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో తుంగతుర్తి ఆస్పత్రి స్థాయి పెంపు అంశాన్ని ఎమ్మెల్యే కిశోర్ మరోసారి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే దీనిని 100 పడకల ఏరియా ఆస్పత్రిగా మారుస్తూ నిర్ణయం తీసుకుని ఉత్తర్వులు వెలువరించారు.

స్పెషలిస్ట్ డాక్టర్లతో అందనున్న వైద్యం

తుంగతుర్తి నియోజకవర్గ ప్రజలు మెరుగైన వైద్యం కోసం సూర్యాపేట జిల్లా కేంద్రానికి వెళ్లేవారు. ఇక ఆస్పత్రి స్థాయి పెరగడంతో తుంగతుర్తిలోనే ఉచిత వైద్యం చేయించుకునే వీలు కలగనుంది. స్పెషలిస్టులచే వైద్య సేవలు అందుతాయి. 100 మంది సిబ్బందితో పాటు గైనకాలజిస్టు, చిన్నపిల్లల, ఆర్థోపెడిక్, కంటి, దంత, అనస్తీషియా, ఫిజిషియన్ డాక్టర్ల నియామకంతో పాటు ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, ల్యాబ్ టెక్నీషియన్ల సేవలు అందుబాటులోకి రానున్నాయి. గతంలో తుంగతుర్తి ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ కృషి చేసి 100 పడకల ఆస్పత్రిని మంజూరు చేయించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

“ ప్రజల కల సాకారమైంది



ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న తుంగతుర్తి నియోజకవర్గ ప్రజల 100 పడకల కల సాకారమైంది. 100 పడకల ఏరియా ఆస్పత్రి మంజూరుకు సహకరించిన సీఎం కేసీఆర్, మంత్రులు హరీష్‌రావు, జగదీశ్ రెడ్డికి కృతజ్ఞతలు.

– గాదరి కిశోర్‌కుమార్, ఎమ్మెల్యే, తుంగతుర్తి

కనీస వసతులు కల్పించాలి

- కలెక్టర్ వెంకట్రావు



దురాజ్‌పల్లిలో కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

చివ్వెంల (సూర్యాపేట) : కంటి వెలుగు శిబిరానికి వచ్చిన ప్రజలకు కనీస వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు అన్నారు. మండల పరిధిలోని దురాజ్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహిస్తున్న శిబిరాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. రిజిస్ట్రేషన్‌లో పేర్లు నమోదు చేయాలని దూరదృష్టి దగ్గర దృష్టికి తేడాలను కనిపెట్టి వాటికి తగ్గట్టుగా కళ్లజోళ్లు అందించాలన్నారు. కంటి చూపుతో బాధపడుతున్న వారికి సరైన అవగాహన కల్పించి ఎక్కువ స్క్రీనింగ్‌లు నమోదయ్యేటట్లు వైద్యులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. మంగళవారం ఎంత మందిని పరీక్షించారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ భూమిక మాట్లాడుతూ ఈ సెంటర్‌లో 760 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 160 మందికి దగ్గర చూపు కంటి అద్దాలు అందజేశామని, 40 మంది లాంగ్‌డిస్టెన్స్ ఉన్నవారి వివరాలు పై అధికారులకు పంపామని తెలిపారు. కంటిపరీక్షలు చేయించుకోవడానికి వచ్చిన కంకిపాటి శారద ను ప్రభుత్వం అమలుపరుస్తున్న కంటి వెలుగు కార్యక్రమం మంచిదేనా అని కలెక్టర్ అడిగారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ కోటాచలం, మెడికల్ ఆఫీసర్ భూమిక, ఆప్తమాలజిస్ట్ కె. నిస్సి, డాటా ఎంట్రీ ఆపరేటర్ సంగ్రామ్, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి



మాట్లాడుతున్న జడ శ్రీనివాస్

హుజూర్‌నగర్: లేబర్ వెల్ఫేర్ బోర్డులో పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణ కార్మికుల దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ కోరారు. హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన భవననిర్మాణ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సంక్షేమ బోర్డులో 2018 నుంచి ఈఏడాది జనవరి 31 వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన జిల్లా కలెక్టర్‌తోపాటు డీసీఎల్‌లకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు చెప్పారు.సమావేశంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జెట్టి ప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఇందిరాల వెంకటేశ్వర్లు, ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ పట్టణ కార్యదర్శి దగ్గుపాటి సత్యానందం, ముడుసు పాపారావు, సత్యం నల్మాద వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే క్రీడా ప్రాంగణాలు



నేరేడుచర్ల మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న జెడ్పీ సీఈఓ సురేష్

నేరేడుచర్ల : గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తోందని జెడ్పీసీఈఓ జి. సురేష్ అన్నారు. మంగళవారం మండలంలోని దిర్శించర్లలో క్రీడా ప్రాంగణ స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో తహసీల్దార్ సరిత, ఎంపీడీఓ శంకరయ్య, జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, ఎంపీఓ విజయకుమారి, ఏపీఓ శేఖర్ తదితరులున్నారు.

మద్దతుకు మించి ధరలు

- గరిష్టంగా క్వింటా వేరుశనగకు రూ.8639, కందికి రూ.7036
- రెండు వారాలుగా తిరుమలగిరి మార్కెట్‌కు కంది, వేరుశనగ రాక
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



తిరుమలగిరి మార్కెట్‌లో వేరుశనగ రాశులు




మార్కెట్‌కు వచ్చిన కందులు

తిరుమలగిరి : ఈసారి వేరుశనగ, కంది పంటలకు మంచి ధర పలుకుతోంది. ప్రభుత్వ మద్దతు ధరల కంటే ఎక్కువ వస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వేరుశనగకు ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.5850 ఉండగా బహిరంగ మార్కెట్‌లో అంతకు మించి పలుకుతోంది. తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు రెండు వారాలుగా వేరుశనగ కాయ వస్తోంది. సోమవారం గరిష్టంగా క్వింటాకు రూ.8639 ధర పలికింది. గత నెల 30న మార్కెట్‌లో వేరుశనగకు క్వింటాకు రూ.7 వేలకు పైగానే ధరలు నమోదయ్యాయి. తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు ఇప్పటి వరకు 2435 క్వింటాళ్ల వేరుశనగ కాయ వచ్చింది. మార్చి మొదటి వారం వరకు వేరుశనగ వస్తుందని మార్కెట్ అధికారులు చెబుతున్నారు. గత సంవత్సరం మార్కెట్‌కు 7110 క్వింటాళ్ల వేరుశనగ రాగా క్వింటాకు గరిష్టంగా రూ. 6890, కనిష్టంగా రూ.5500 ధర పలికింది. కానీ ఈసారి ప్రారంభంలోనే అధిక ధరలు నమోదవుతున్నాయి. మార్కెట్‌లో రైతుల నుంచి ప్రజలు విరివిగా వేరుశనగ కాయలు కొనుగోలు చేస్తున్నారు. ఆరోగ్యపరంగా శుద్ధమైన నూనెకోసం వేరుశనగ కాయను కొనుగోలు చేస్తున్నారు. దీనికి తోడు ఇంట్లో అవసరాల కోసం కూడా వేరుశనగ నూనెను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో వేరుశనగ కాయకు మంచి డిమాండ్ ఏర్పడింది. గతంలో కంటే సాగు విస్తీర్ణం తగ్గినా ఎంఎస్‌పీ కంటే అధిక ధరలు పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కంది ధర పైపైకి..

కంది సాగు చేసే రైతులకు కూడా ఈసారి మంచి ధరలే వస్తున్నాయి. జిల్లాలో 2963 ఎకరాల్లో కంది పంటను సాగు చేశారు. ప్రస్తుతం కందులకు కేంద్ర ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.6600 ఉంది. తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు ఇప్పటి వరకు 8440 క్వింటాళ్ల కందులు వచ్చాయి. గరిష్టంగా క్వింటాకు రూ.7036, కనిష్టంగా రూ.5800 ధర పలికింది. గత సంవత్సరం తిరుమలగిరి మార్కెట్‌కు కందులు 30877 క్వింటాళ్లు వచ్చాయి. ఈసారి కూడా కందులు ఫిబ్రవరి చివరి వరకు వస్తాయని అధికారులు చెబుతున్నారు. కందులకు ప్రభుత్వ మద్దతు ధర కంటే అధికంగా వస్తుండటంతో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేయడం లేదని తెలుస్తోంది.


మంచి ధర పలికింది



“ నేను 30 గుంటల్లో వేరుశనగ పంట వేశాను. నాలుగు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. క్వింటాకు రూ.8639 ధర పలికింది. మంచి ధర రావడంతో గిట్టుబాటు అయ్యింది.

– యాదమ్మ, రైతు, లక్ష్మక్కపల్లి


ధర బాగానే వచ్చింది



“ నేను ఎకరం పది గుంటల్లో వేరుశనగ పంట వేశాను. మార్కెట్‌కు పంటను తీసుకొని వెళ్తే ధర బాగానే వచ్చింది. క్వింటాకు రూ.7406 ధర వచ్చింది.

– చెవిటి కొమురయ్య, గుమ్మడవెల్లి

గిట్టుబాటు అయ్యింది



“ ఈసారి మూడు ఎకరాల్లో కందులను అంతర్ పంటగా వేశాను. మంచి విత్తనాలు లభించడంతో నాణ్యతగా పంట వచ్చింది. ఐదు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. క్వింటాకు రూ.6969 ధర పలికింది.

– కె.రమేష్, లక్ష్మీనారాయణపురం

గోదావరి జలాలు పెంపు

అర్వపల్లి: జిల్లాకు గోదావరి జలాలను మంగళవారం పెంచారు. 700 క్యూసెక్కుల గోదావరి జలాలు వస్తుండగా వాటిని ఒకేసారి 1600 క్యూసెక్కులకు పెంచారు. ఇందులో 69 డీబీఎంకు 400 క్యూసెక్కులు, 70 డీబీఎంకు 70 క్యూసెక్కులు, 71 డీబీఎంకు 1130 క్యూసెక్కుల చొప్పున నీటిని వదులుతున్నట్లు నీటి పారుదలశాఖ ఈఈ విజయ్‌కుమార్, డీఈఈ సత్యనారాయణ, ఏఈఈ అమర్ తెలిపారు. వ్యవసాయానికి నీటి వాడకం పెరుగుతుండటంతో గోదావరి జలాలను పెంచినట్లు అధికారులు చెప్పారు.

సర్క్యులర్‌ను కేంద్రం వెనక్కి తీసుకోవాలి

కోదాడఅర్బన్ : ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే రాష్ట్రాలకు అదనపు రుణాలు ఇచ్చేది లేదని కేంద్ర ప్రభుత్వం 2023-2024 ఆర్థిక సంవత్సరానికి జారీ చేసిన సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని టీఎస్ సీపీఎస్‌ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బడుగుల సైదులు డిమాండ్ చేశారు. మంగళవారం కోదాడలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆ ఉద్యోగుల సొమ్మును తన ఖాపెట్టే అధికారం కేంద్రానికి ఎక్కడ ఉందని ప్రశ్నించారు. ఉద్యోగుల సామాజిక భద్రత, సంక్షేమం కోరే రాష్ట్రాలు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నాయని, వాటికి ఆర్థిక సహకారం అందించాల్సింది పోయి ఆంక్షలు విధించడం శోచనీయమన్నారు. కేంద్రం ఆలోచన ఎప్పుడూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగానే ఉందన్నారు. ఉద్యోగుల డబ్బుతో ఆదానీ లాంటి వారు షేర్లలో పెట్టుబడి పెట్టి బిలియనీర్లు అవుతున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం తక్షణమే అసెంబ్లీ సమావేశాల్లో సీపీఎస్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలని కోరారు.

పట్నం వేసి.. పెళ్లి చేసి..

పెద్దగట్టులో వైభవంగా చంద్రపట్నం, లింగమంతుల కల్యాణోత్సవం

గంట దీపంతో మొక్కు చెల్లింపు

కోరిన కోరికలు తీర్చే లింగమంతుల స్వామికి జాతర సందర్భంగా భక్తులు మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. పుట్టు వెంట్రుకలు తీసే క్రమంలో యాదవ సోదరులు గంట దీపంతో మొక్కును చెల్లించుకుంటారు. చిన్నపాటి మట్టి పాత్రలో దీపాన్ని వెలిగించి పుట్టు వెంట్రుకలు తీసే చిన్నారి తలపై పెట్టి గట్టుపైకి వెళ్లి లింగమంతులస్వామి, చౌడమ్మ తల్లిని దర్శించుకుంటారు. ఈ క్రమంలో ఎడవెల్లి గ్రామానికి చెందిన ఓ భక్తుడు గంట మొక్కు తీర్చుకునేందుకు భేరీచప్పుళ్లు.. లింగమంతుని పాటల నడుమ గట్టుపైకి వెళ్లడం చూపరులను ఆకట్టుకుంది.

నాణ్యత లేని ప్రసాదాలు

సూర్యాపేటక్రైం: పెద్దగట్టు జాతర నేపథ్యంలో వ్యాపారులు భక్తుల వద్ద నుంచి అందినకాడికి దండుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. దేవస్థానం పక్కనే లడ్డు, పులిహోర విక్రయాల దుకాణం ఉండగా, అధికారులు ఒక్కొక్క లడ్డూను రూ.20కి భక్తులకు విక్రయించాలని సూచించారు. కానీ వ్యాపారులు అవేమీ పట్టించుకోకుండా రూ.100కి 4 లడ్డూలు మాత్రమే ఒకే కవర్‌లో ప్యాక్ చేసి ఇస్తున్నారు. దీనిపై ఓ భక్తుడు దేవాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారి నుంచి స్పందన కనిపించలేదు. అంతేకాకుండా లడ్డూ పరిమాణం, నాణ్యతలో కూడా తేడాలు ఉన్నట్లు భక్తులు ఆరోపిస్తున్నారు. పులిహోర మరింత పసుపుపచ్చగా కనిపించాలని కెమికల్ పౌడర్‌ను వాడుతున్నట్లు ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కి సమాచారం ఇవ్వగా, వచ్చి నామమాత్రంగా తనిఖీ చేస్తున్నారే తప్ప విక్రయదారులపై ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదని భక్తులు వాపోతున్నారు.


ప్రసాదాలు విక్రయించే ప్రాంతం


పెద్దగట్టు జాతర వద్ద రాత్రి సమయంలో భక్తుల సందడి


స్వామివారి దర్శనానికి బారులుదీరిన భక్తులు


లింగమతుల స్వామికి కోడి పుంజు మొక్కు చెల్లించుకుంటున్న యువతి

భానుపురి (సూర్యాపేట): తెలంగాణలోను రెండో అతిపెద్దది అయిన పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతర వైభవంగా కొనసాగుతోంది. సోమవారం మూడో రోజు కూడా భక్తులు తమ చుట్టాలు, కుటుంబ సభ్యులతో అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల సందడితో పెద్దగట్టు పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

దుకాణాల వద్ద భక్తుల కిటకిట

జాతరలో వెలిసిన దుకాణాల వద్ద భక్తుల సందడి నెలకొంది. ఎక్కువగా మహిళలు గాజుల షాపులతోపాటు, అలంకరణ వస్తువుల వద్ద బారులుదీరారు. జాతర గుర్తుగా గాజులు వేయించుకోవడంతోపాటు, బంధువులకు కొనుగోలు చేసి తీసుకెళ్లారు.

నిరంతర వైద్య సేవలు

జాతరకు వచ్చే భక్తులకు చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా చికిత్స వైద్య సేవలు అందిస్తున్నారు. గట్టుకు నాలుగు దిక్కులు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల వద్ద కరోనాపై అవగహన కల్పించడమే కాకుండా, మాస్క్‌లు పంపిణీ చేస్తున్నారు.


చంద్రపట్నం వేస్తున్న యాదవులు

అపరిశుభ్రంగా పరిసరాలు

లింగమంతుల స్వామి జాతరలో మూడో రోజు పారిశుద్ధ్య సిబ్బంది చేతులెత్తేశారు. జాతర పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారంతో భక్తులు ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొదటి రెండు రోజులు పక్కా ప్రణాళికతో పని చేసిన పారిశుద్ధ్య సిబ్బంది మూడో రోజు అంతగా దృష్టి పెట్టలేదు.

గొంగళి వ్యాపారుల సందడి

జాతరలో యాదవుల సంప్రదాయ దుస్తులను విక్రయిస్తున్నారు. జీవాలను కాసేవారు ఎండ, వాన, చలి నుంచి రక్షణ పొందడానికి గొంగళిని ఉపయోగిస్తారు. దీంతో జాతర వద్ద వ్యాపారులు గొంగళ్ల విక్రయిస్తున్నారు. ఇక్కడ ఒక్కో గొంగళి రూ.800 నుంచి వెయ్యి వరకు పలుకుతోంది. వీటిని కొనుగోలు చేసేందుకు యాదవులు ఆసక్తి చూపుతున్నారు.


చంద్రపట్నం వద్ద దేవరపెట్టె


జాతర వద్ద ఫొటో తీస్తున్న యువతి


స్వామికి బోనం వండుతున్న వృద్ధురాలు


బందోబస్తులో ఉన్న పోలీసులు

కోనేరుకు తాళం... భక్తుల అసహనం



పెద్దగట్టుపై దేవాలయానికి ఉత్తరపక్క ఉన్న కోనేరులో భక్తులు స్నానాల ఆచరించి స్వామివారిని దర్శించు కునేవారు. పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా గుట్టపై కాకుండా గుట్ట ఉత్తర భాగంలోనే లక్షలు వెచ్చించి గతంలోని కోనేరును నిర్మించారు. ప్రస్తుతం ఈ కోనేరుకు రంగులు వేసి మంచినీటిని నింపి సుందరంగా తీర్చిదిద్దినప్పటికీ... భక్తులకు అందుబాటులోకి తీసుకు రాలేదు. కోనేరులోకి వెళ్లే గేట్లకు తాళాలు వేయడంతో కోనేరు కట్టింది దేనికంటూ భక్తులు అసహనం వ్యక్తం చేశారు.

హలో.. వినిపిస్తుందా..?

సూర్యాపేటక్రైం : పెద్దగట్టు జాతరలో సెల్‌ఫోన్లు పనిచేయక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వేల సంఖ్యలో సెల్‌ఫోన్లు ఒకే టవర్ కిందికి రావడంతో సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్నాయని అంటున్నారు. ఎన్నిసార్లు ప్రయత్నించినా ఫోన్లు కలవకపోవడంతో ఒకరినొకరు కలుసుకోలేక మైకు ప్రకటనలను సంప్రదిస్తున్నారు. బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ ఫోన్లు మాత్రమే కొంత వరకు పనిచేశాయి. అయితే, అందరి చేతుల్లోనూ స్మార్ట్ ఫోన్లు ఉన్నప్పటికీ మాట్లాడుకోడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దూర ప్రాంతాలకు వెళ్తే గానీ సిగ్నల్స్ దొరకడం లేదు.

తెలంగాణ సంస్కృతిని కాపాడటమే ధ్యేయం

- పెద్దగట్టు జాతర ఏర్పాట్లలో ప్రభుత్వ శాఖల పనితీరు భేష్
- మంత్రి జగదీశ్‌రెడ్డి


కుటుంబ సమేతంగా పూజలు చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

చివ్వెంల (సూర్యాపేట): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటమే కేసీఆర్ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కుటుంబ సమేతంగా పెద్దగట్టు జాతరకు హాజరై లింగమంతుల స్వామి వారికి నిర్వహించిన చంద్రపట్నం, కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 12లక్షల మందికి పైగా భక్తులు జాతరలో పాల్గొన్నారని తెలిపారు. మరో రెండు రోజులు కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని.. దానికి అనుగుణంగా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. ఆలయ కమిటీ సభ్యులు, ప్రభుత్వ యంత్రాంగం, పోలీసులు సమష్టిగా పనిచేస్తూ జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకుంటున్నారని కితాబిచ్చారు. లింగమంతుల స్వామి దయతో తెలంగాణ అభివృద్ధి మరింత పురోగమించాలని ఆకాంక్షించారు. అనంతరం జాతర నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలీసు కంట్రోల్ రూంను పరిశీలించారు. సీసీ కెమెరాల ద్వారా పోలీసు శాఖ చేపట్టిన నిఘా గురించి సూర్యాపేట జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యుత్, ఆరోగ్య, మున్సిపల్ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి ఉద్యోగులతో ఫొటోలు దిగారు.


భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం

పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం

- భూ వివాదంలో దుర్భాషలాడడంతో మనస్తాపం చెందిన వ్యాపారి
- మోత్కూరు పోలీస్ స్టేషన్ ఎదుట ఘటన

మోత్కూరు: భూ వివాదంలో అకారణంగా తన ఇంటికి వచ్చి బూతులు తిట్టారని మనస్తాపానికి గురైన ఓ వ్యాపారి పోలీస్ స్టేషన్ ఆవరణలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన మంగళవారం మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు.. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామానికి చెందిన శ్యాంశెట్టి రమేష్ గతంలో శివరాత్రి లింగయ్య వద్ద రెండు గుంటల భూమిని కొనుగోలు చేశాడు. ఆ భూమిని రమేష్ తిరిగి లింగయ్య కుమారులకు విక్రయించాడు. లింగయ్య పెద్ద కుమారుడు వెంకటేష్‌కు రెండు గుంటల భూమి రిజిస్ట్రేషన్ చేసేటట్లు బాండ్ పేపర్ మీద రాసి ఇచ్చాడు. అనంతరం గ్రామంలో జరిగిన భూ పంచాయతీలో లింగయ్య కుమారులు ఇద్దరికి చెరొక గుంట చొప్పున రిజిస్ట్రేషన్ చేసేటట్లు ఒప్పందం చేసుకొని రిజిస్ట్రేషన్ చేశారు. ఈ క్రమంలో వెంకటేష్‌కు గతంలో రాసి ఇచ్చిన బాండ్ పేపర్ చెల్లదని పెద్ద మనుషులు తీర్మానం చేశారు. ఈ విషయంపై కొంతకాలంగా లింగయ్య పెద్ద కుమారుడు వెంకటేష్ రమేష్ మధ్య గొడవ నడుస్తుంది. ఇదిలా ఉండగా సోమవారం రాత్రి వెంకటేష్ మద్యం మత్తులో రమేష్ ఇంటికి వచ్చి తనకు రెండు గుంటలు రిజిస్ట్రేషన్ చేయాలని నానా బూతులు తిట్టడంతో రమేష్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం మున్సిపల్ కేంద్రంలోని ఓ షాపులో పురుగు మందు కొనుగోలు చేసి బైక్‌పై పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ లెంకల వేణుతో పాటు మరికొంత మంది పెద్ద మనుషులను పోలీస్ స్టేషన్‌కు రమ్మని లింగయ్య కుమారులపై ఫిర్యాదు చేయాలని రమేష్ పిలిపించాడు. పోలీస్ స్టేషన్‌లోకి వెళ్లక ముందే రమేష్ తన వెంట తెచ్చుకున్న పురుగు మందు తాగాడు. దీంతో పెద్ద మనుషులు రమేష్‌ను స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా రమేష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే పోలీస్ స్టేషన్‌లో కొండగడప భూ వివాదానికి సంబంధించిన ఎలాంటి ఫిర్యాదు అందలేదని, స్టేషన్ ఆవరణలో పురుగు మందు తాగినటువంటి సంఘటన కూడా చోటు చేసుకోలేదని ఎస్ఐ వంగాల జానకిరాంరెడ్డి తెలిపారు.

ఆడ శిశువును సాకలేక..

- బంధువులకు ఇచ్చిన తల్లిదండ్రులు
- విషయం తెలునుకుని విచారణ చేపట్టిన ఐసీడీఎస్ అధికారులు
- పాప హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తింపు
- ఈ నెల 11న పాపను అప్పగిస్తామని తల్లిదండ్రుల హామీ


మాచనపల్లి గ్రామంలో వివరాలు సేకరిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

మిర్యాలగూడ: ఆ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు ఉండగా మూడో కాన్పులో సైతం ఆడ శిశువు జన్మించడంతో సాకలేక పసిపాపను తమ బంధువులకు ఇచ్చిన సంఘటన మాడ్గులపల్లి మండలంలోని మాచనపల్లి గ్రామంలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. మాచనపల్లి గ్రామానికి చెందిన గన్నెపాక మహేష్, కవిత భార్యాభర్తలు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉండగా, మూడో కాన్పులో భాగంగా గత నవంబర్‌లో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో కవిత మరోసారి ఆడ శిశువు జన్మనిచ్చింది. ఆస్పత్రి నుంచి డిచ్చార్జ్ అయిన తర్వాత స్వగ్రామానికి వెళ్లిన మహేష్, కవిత దంపతులు.. గత నెలలో మిర్యాలగూడలోని తమ బంధువుల ఇంటికి వెళ్లి అక్కడే ఉన్నారు. తిరిగి ఈ నెల స్వగ్రామానికి తిరిగి వచ్చారు. అయితే మహేష్, కవిత దంపతుల మొదటి ఇద్దరి ఆడపిల్లలను నాయనమ్మ వెంకటమ్మ అంగన్‌వాడీ పాఠశాలకు పంపించగా, అక్కడ అంగన్‌వాడీ టీచర్ మీ మూడో మనుమరాలు బాగుందా అని వెంకటమ్మను అడిగింది. దీంతో పాపను సాదుకోమని తమ బంధువులకు ఇచ్చామని వెంకటమ్మ చెప్పడంతో అంగన్‌వాడీ టీచర్, ఆశ వర్కర్ కలిసి మహేష్ ఇంటికి వెళ్లి పాప విషయంపై ఆరా తీశారు. పాపను తమ సమీప బంధువులకు ఇచ్చామని మహేష్ చెప్పడంతో అంగన్‌వాడీ టీచర్ వెంటనే ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించింది. దీంతో మంగళవారం ఐసీడీఎస్ అధికారిణి నాగమణి, ఐసీపీఎస్ అధికారిణి రమణి మహేష్ ఇంటికి వెళ్లి విచారించగా పాప ప్రస్తుతం హైదరాబాద్‌లోని బంధువుల ఇంట్లో ఉందని తెలిసింది. ఈ నెల 11న పాపను అప్పగిస్తామని మహేష్, కవిత దంపతులు అధికారులకు హామీ పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. పసి పిల్లలను ఇతరులకు విక్రయించకూడదని అలా చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని అన్నారు. వారి వెంట అంగన్‌వాడీ టీచర్ పద్మ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


నరేందర్‌రెడ్డి (ఫైల్)

నార్కట్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని ఎల్లారెడ్డిగూడెం వద్ద నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. నార్కట్‌పల్లి ఎస్ఐ రామకృష్ణ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. శాలిగౌరారం మండలం బైరోనిబండ గ్రామానికి చెందిన దండ నరేందర్‌రెడ్డి(46) చిట్యాల నుంచి తన డీసీఎంలో సిమెంట్ దిమ్మెల లోడుతో నల్లగొండకు బయల్దేరాడు. మార్గమధ్యలో ఎల్లారెడ్డిగూడెం శివారులో ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో దండ నరేందర్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని అంబులెన్స్‌లో నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ..

నకిరేకల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్‌లోని తాటికల్ రోడ్డులో నివాసముంటున్న ఎనగల్ల రాము(41) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రాము గత నెల 31న నకిరేకల్ నుంచి తన స్నేహితుడు జానితో కలిసి బైక్‌పై నల్లగొండకు వెళ్తుండగా మార్గమధ్యలో తాటికల్ వద్ద వృద్ధాశ్రమం సమీపంలో అదుపుతప్పి రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఇద్దరినీ చికిత్స నిమిత్తం నల్లగొండకు తరలించారు. రాము పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

దేవరకొండ: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పాత్లావత్‌తండా(పి)కు చెందిన వాంకుడావత్ రవి(38) అదే తండాకు చెందిన వాంకుడావత్ కోట్యతో కలిసి తండా శివారులో గల బొడ్డుపల్లి చెరువు వద్దకు చేపలు పట్టేందుకు వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత కోట్య పక్కనే ఉన్న చేను వద్దకు వెళ్లి వచ్చేసరికి అప్పటికే చెరువులో రవి విగతజీవిగా కనిపించాడు. దీంతో విషయాన్ని రవి కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో చెరువు వద్దకు చేరుకున్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి సోదరుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

యువకుడు అదృశ్యం


గల్లా నతానియేల్

మఠంపల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం సారంగపల్లి అగ్రహారం గ్రామానికి చెందిన 26 ఏళ్ల గల్లా నతానియేల్ మఠంపల్లిలో అదృశ్యమైనట్లు మంగళవారం ఎస్ఐ ఇరుగు రవి తెలిపారు. నతానియేల్ ఈ నెల 6న రాత్రి మఠంపల్లి మండల కేంద్రానికి వచ్చి స్థానిక పంజాబీ దాబా ప్రాంతంలో కనిపించకుండా పోయాడని అతడి తండ్రి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. యువకుడి ఆచూకీ తెలిసిన వారు మఠంపల్లి పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

అంబులెన్స్ బోల్తా


రోడ్డు పక్కన బోల్తాపడిన అంబులెన్స్

మద్దిరాల: మండల పరిధిలోని రెడ్డిగూడెం శివారులో 365వ నంబర్ జాతీయ రహదారి సమీపంలో మంగళవారం అంబులెన్స్ బోల్తాపడింది. వివరాలు.. హైదరాబాద్ నుంచి మహబూబాబాద్‌కు రోగులను తీసుకొచ్చిన అంబులెన్స్ తిరుగు ప్రయాణంలో రెడ్డిగూడెం శివారులో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అంబులెన్స్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించారు.

కూలిన పెంకుటిల్లు

- మహిళకు స్వల్ప గాయాలు

చివ్వెంల (సూర్యాపేట): మండల కేంద్రంలోని ఓ పురాతన పెంకుటిల్లు కూలడంతో మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన వల్దాసు జానమ్మ సుమారు 25 ఏళ్ల క్రితం నిర్మించిన పెంకుటి ఇంట్లో ఒంటరిగా నివాసముంటుంది. మంగళవారం ఇంట్లో నుంచి బయటకు వచ్చిన ఆమె తిరిగి ఇంట్లోకి వెళ్తుండగా ఇంటి పైకప్పు ఒకసారి కుప్పకూలింది. దీంతో పెంకులు జానమ్మ తలపై పడడంతో ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని ఆర్ఐ రామారావు పరిశీలించారు.

భర్త ఇంటి ఎదుట భార్య ధర్నా

- తనతో కాపురం చేయకుండా రెండో వివాహం చేసుకున్నాడని ఆరోపణ
- న్యాయం చేయాలని డిమాండ్


ధర్నా చేస్తున్న నామా కల్పన, మహిళా సంఘాల నాయకులు

సూర్యాపేటక్రైం: తన భర్త రెండో వివాహం చేసుకున్నాడని భార్య అతడి ఇంటి ఎదుట ధర్నా నిర్వహించిన సంఘటన సూర్యాపేట పట్టణంలోని విద్యానగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. విద్యానగర్‌కు చెందిన నామా కిరణ్, కల్పనకు 2016లో వివాహం జరిగింది. పెళ్లి తర్వాత వీరు హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. వీరికి సంతానం లేదు. కరోనా సమయంలో కల్పనకి కరోనా రావడంతో భర్తకు, ఆమెకు మధ్య గొడవలు జరిగాయి. ఈ క్రమంలో నామా కిరణ్ ఇటీవల మోతె మండలం నామవరం గ్రామానికి చెందిన వాసా శారదను రెండో వివాహం చేసుకున్నాడు. ఇది తెలుసుకున్న కల్పన తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సూర్యాపేట పట్టణంలోని విద్యానగర్‌లో గల భర్త ఇంటి ఎదుట తన తల్లి, మహిళా సంఘాలతో కలిసి ధర్నా నిర్వహించింది. ఈ ధర్నాలో మహిళా సంఘం నాయకురాలు పిడమర్తి నాగేశ్వరి మాట్లాడుతూ.. కల్పనను వివాహం చేసుకుని చట్టప్రకారం విడాకులు తీసుకోకుండానే మరో వివాహం చేసుకున్న కిరణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.